సాక్షి
పార్వతీపురం మన్యం
శుక్రవారం । 11 । ఏప్రిల్ । 2025



పింఛన్ కోసం ఎదురుచూస్తూ..
ఏ ఆధారం లేని తనకు పింఛన్ సొమ్ము వస్తే జీవనం సాఫీగా సాగించవచ్చని భావించింది.
- 8లో



సివిల్ వర్క్స్ పూర్తి చేయాలి
జిల్లాలోని పీఎంశ్రీ పాఠశాలల్లో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను రెండు వారాల్లో పూర్తి చేయాలని పథకం రాష్ట్ర అధికారుల బృందం ఆదేశించింది.
- 8లో



రూ.కోటికి పైగా విలువైన సిగరెట్లు సీజ్
- 8లో
ఒడిశా నుంచి ఏపీలోకి వచ్చిన రూ.కోటి 72 లక్షల విలువ గల సిగరెట్లను విజిలెన్స్ అధికారులు సీజ్ చేశారు.

న్యూస్‌రీల్

సమ్మర్ ఆన్‌లైన్ ఇంటర్న్‌షిప్‌కు దరఖాస్తు చేసుకోండి

- జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి



కె.సాయికృష్ణ చైతన్య

పార్వతీపురంటౌన్: సమ్మర్ ఆన్‌లైన్ షార్ట్‌టర్మ్ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్‌కు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె.సాయికృష్ణ చైతన్య పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ ప్రోగ్రామ్ రెండు విడతలుగా నిర్వహిస్తారని తెలిపారు. మొదటి విడత ఈ నెల 28 నుంచి, రెండవ విడత మే 12 నుంచి ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. 2025–26 విద్యా సంవత్సరానికి చెందిన మూడవ, నాల్గవ సంవత్సరం సీఎస్ఈ/ఐటీ, ఈసీఈ, ఈఈఈ మెకానికల్, సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులకు ప్రత్యేకంగా ఈ కోర్సు రూపొందించినట్లు పేర్కొన్నారు. అర్హులైన విద్యార్థులు హెచ్‌టీటీపీఎస్://నైపుణ్యం.ఏపీ.జీఓవీ.ఐన్/యూజర్-రిజిస్ట్రేషన్ వెబ్‌సైట్ ద్వారా రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు ఫోన్ 9988853335, 8712655686, 8790117279, 8790118349 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

నులకజోడులో వింత జ్వరాలు

- అంబులెన్స్‌లో బత్తిలి ఆస్పత్రికి బాధితుల తరలింపు

భామిని: మండలంలోని నులకజోడులో వింత జ్వరాలతో పాటు కీళ్ల నొప్పులతో లేవలేని దుస్థితిలో గ్రామస్తులు మంచం పట్టి ఉన్నారు. ఈ సమాచారం తెలుసుకున్న వైద్యసిబ్బంది రోగులను గురువారం 108 అంబులెన్స్‌లో బత్తిలి పీహెచ్‌సీకి తరలించారు. చికెన్‌గున్యా లక్షణాలైన కీళ్ల నొప్పులతో బాధపడుతున్న వారికి బత్తిలి పీహెచ్‌సీలో వైద్యాధికారి దామోదరరావు ఆధ్వర్యంలో వైద్యసేవలు అందించి, రక్త నమూనాలు సేకరించారు. తిరిగి బాధితులను స్వగ్రామానికి తరలించారు. అనంతరం ఏఎన్ఎం ఇంద్రజ ఆధ్వర్యంలో పీహెచ్‌సీ వైద్య సిబ్బంది నులకజోడులో వైద్యశిబిరం నిర్వహించి ఇంటింట ఫీవర్ సర్వే చేశారు.

టీడీపీ నాయకులతో కలిసి అధికారులతో మంత్రి సమీక్ష


- సాక్షి రిపోర్టర్‌కు అనుమతి నిరాకరణ



అధికార టీడీపీ నాయకులను పక్కన కూర్చోబెట్టుకుని అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి సంధ్యారాణి

మెంటాడ: అధికార పార్టీ నాయకులకు ఏ హోదా లేక పోయినా సరే పక్కన కూర్చోపెట్టుకుని అధికారులతో రాష్ట్ర గిరిజన శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి వివిధ శాఖలకు చెందిన అధికారులతో పాటు, ప్రోటోకాల్ ప్రకారం మండలంలోని ప్రజాప్రతినిధులు హాజరు కావాల్సి ఉంది. అయితే నిబంధనలను, ప్రోటోకాల్‌ను పక్కన పెట్టి అధికార టీడీపీ మండల అధ్యక్షుడు చలుమూరి వెంకటరావుతో పాటు మాజీ అధ్యక్షుడు గెద్ద అన్నవరంలకు ఎటువంటి హోదా లేకపోయినా వారిని పక్కన కూర్చోబెట్టుకుని గది తలుపులు మూసివేసి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశాన్ని కవర్ చేయడానికి వెళ్లిన సాక్షి రిపోర్టర్‌ను మంత్రి ఆదేశాలతో సమావేశం హాల్‌లోనికి వెళ్లనీయకుండా పోలీసులు బలవంతంగా బయటకు పంపించేశారు. కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు, తహసీల్దార్ కోరాడ శ్రీనివాసరావు, ఎంపీడీఓ కె.భానుమూర్తి పాల్గొన్నారు.

ఘనంగా గిరిజన పండగ



గిరిజన ఆచార సంప్రదాయాల ప్రకారం పండగ నిర్వహిస్తున్న దృశ్యం

సీతంపేట:

మండలంలోని కురిసింగి పెద్దగూడ గ్రామంలో ఘనంగా గిరిజన ఆచార సంస్కృతి సంప్రదాయాల ప్రకారం విప్పకొత్త, బోనాలు, మామిడికొత్తల పండగ నిర్వహించారు. ఏటా ఇదే సీజన్‌లో మామిడి కాయలు, విప్పపువ్వు పూసిన అనంతరం పితృదేవతలకు నైవేద్యంగా పెట్టి పూజిస్తారు. గ్రామ శివారున ఉన్న దేవతలకు యజ్జురోడు, జన్నోడులతో పూజలు చేయించి నృత్యాలు చేస్తారు. ఒంటినిండా ఆకులు కట్టుకుని వేటకు వెళ్లినట్లు వేషధారణ వేస్తారు. ఇలా ప్రతిరోజూ ఏదో ఒక గిరిజన గ్రామంలో పండగ నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తోంది.

మురికిపాలిటీలు



పార్వతీపురం: డంపింగ్ యార్డు వద్ద చెత్త

- పట్టణాల్లో పడకేస్తున్న పారిశుద్ధ్యం
- తూతూమంత్రంగా పారిశుద్ధ్య పనులు
- నిర్వహణ గాలికొదిలేసిన అధికార యంత్రాంగం
- రాజకీయాల్లో తలమునకలైన ప్రజాప్రతినిధులు

జిల్లాలోని పట్టణాల్లో పారిశుద్ధ్యం పడకేసింది. జిల్లాలో పార్వతీపురం, సాలూరు పురపాలక సంఘాలు కాగా..పాలకొండ నగర పంచాయతీగా ఉంది. ఇక్కడ స్థానిక సంస్థల్లో దాదాపు వైఎస్సార్‌సీపీ సభ్యుల ప్రాతినిధ్యం కావడం..మరోవైపు ఎమ్మెల్యేలుగా కూటమి ప్రజాప్రతినిధులు అధికారంలో ఉండడంతో ప్రభుత్వం నుంచి సహకారం కొరవడుతోంది. ఆయా పురపాలక సంఘాలు, నగర పంచాయతీలో 'కుర్చీలను' స్వాధీనం చేసుకునేందుకు ఎమ్మెల్యేలు చూపిస్తున్న శ్రద్ధ.. పట్టణాల అభివృద్ధిపై పెట్టడం లేదు. ఫలితంగా ఆయా ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా లేక వీధులు మురికికూపాల్లా దర్శనమిస్తున్నాయి.

–సాక్షి, పార్వతీపురం మన్యం/సాలూరు/పార్వతీపురంటౌన్/పాలకొండ

జిల్లాలోని మున్సిపాలిటీలు మురికిపాలిటీలుగా మిగులుతున్నాయి. స్వచ్ఛ పార్వతీపురం సాధన దిశగా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ చెబుతున్నప్పటికీ..క్షేత్రస్థాయిలో అధికారుల నుంచి సహకారం కొరవడుతోంది. మున్సిపల్ అధికారులు సైతం ఎమ్మెల్యేలు చెప్పినట్లే తలాడిస్తుండడం ప్రజలకు శాపంగా మారింది.

పాలకొండలో ముక్కుమూసుకోక తప్పదు..!

పాలకొండ నగర పంచాయతీ పరిధిలో 20 వార్డులున్నాయి. ఇక్కడ 62 వీధుల నుంచి రోజుకు 10–12 టన్నుల వరకు చెత్త ఉత్పత్తి అవుతోంది. 7,739 గృహాలున్నాయి. సుమారు 45 వేల మంది నివసిస్తున్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా వార్డుల్లో పారిశుద్ధ్య చర్యలు కానరావడం లేదు. వీధి కాలువలు పూడికలతో నిండిపోతున్నాయి. కొద్దిపాటి వర్షం కురిసినా మురుగునీరు రోడ్డుపై కెక్కుతోంది. ప్రతిరోజూ చెత్త తరలించే ఏర్పాట్లు లేకపోవడంతో ప్రజలు దుర్గంధం మధ్యే గడుపుతున్నారు. వాహనాలు పంచాయతీకి అందుబాటులో లేకపోవడంతో రోజుల తరబడి చెత్తకుప్పలు వీధుల్లో దర్శనమిస్తున్నాయి. పారిశుద్ధ్య కార్మికులు కూడా తగినంత మంది లేకపోవడంతో వీధులను ఎప్పటికప్పుడు శుభ్రం చేసే ప్రక్రియ సాగడం లేదు. దీనికితోడు డంపింగ్‌యార్డు సమస్య వెంటాడుతోంది. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు డంపింగ్ యార్డుల సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చింది. అధికారం చేపట్టి పది నెలలు కావస్తున్నా ఇంతవరకు ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. మురుగుకాలువలు, వీధుల్లో పందులు, కుక్కల స్వైరవిహారంతో ప్రజలకు అవస్థలు తప్పడం లేదు.



పాలకొండ నగర పంచాయతీలో రహదారి పక్కనే చెత్త కుప్పల మధ్య పశువులు, కుక్కలు

పార్వతీపురం పురపాలక సంఘం పరిధిలో 30 వార్డులున్నాయి. దాదాపు 62 వేల మంది జనాభా ఉంటే..38 ప్రాంతాలు మురికివాడలే. పట్టణంలోని నందమూరి కాలనీ, పాత రెల్లివీధి, పెదమాదిగ వీధి, జనశక్తి కాలనీ, మణికంఠ కాలనీల్లో ఇళ్ల మధ్యే మురుగునీరు దర్శనమిస్తోంది. ఇళ్లు, దుకాణాల నుంచి రోజుకు 21 టన్నుల వరకు వ్యర్థాలను సేకరిస్తున్నారు. ఖాళీ ప్రాంతాలు, గెడ్డలు వ్యర్థాలతో నిండిపోతున్నాయి. ప్రధానరహదారి, కాలువలు పూడికలతో నిండిపోతున్నా మున్సిపల్ అధికారులు తూతూమంత్రంగానే పనులు చేయించి, చేతులు దులుపుకుంటున్నారు. ఏప్రిల్ 1 నుంచి పట్టణంలో పాలిథిన్ నిషేధం అమలు చేస్తామన్న అధికారుల మాటలు..నీటిమీద రాతల్లా మిగులుతున్నాయి. క్లాప్ వాహనాలు మొదట్లో 15 వరకు ఉండగా.. ఇప్పుడు 10 మాత్రమే తిరుగుతున్నాయి. తాము అధికారంలోకి వస్తే డంపింగ్‌యార్డు సమస్య పరిష్కరిస్తామని చెప్పిన ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర..ఇప్పటికీ ఆ హామీని నిలబెట్టుకోలేకపోయారు.

పేరుకే జిల్లా కేంద్రం.. కానరాని పరిశుభ్రత..



పార్వతీపురం: రహదారి పక్కన గెడ్డల్లో పేరుకుపోయిన వ్యర్థాలు

సాలూరులో.. మారని తీరు



పోగువేసి ఉన్న చెత్త



నిరుపయోగంగా ఉన్న మున్సిపాలిటీ వాహనం

సాలూరు పట్టణంలో 29 వార్డులుండగా..సుమారు 52 వేల మంది జనాభా నివసిస్తున్నారు. వీధుల్లో పూడికతీత పనులు తూతూమంత్రంగా జరుగుతున్నాయి. పండగ నేపథ్యంలో కొద్దిరోజుల నుంచి హడావిడిగా పూడికతీత పనులు చేపడుతున్నారు. అవి కూడా ఎక్కడపడితే అక్కడే వదిలేయడం వల్ల మళ్లీ జారుకుని కాలువల్లోకి, రహదారిపైకి చేరుకుంటున్నాయి. ఇక్కడ నిత్యం సుమారు ఎనిమిది టన్నుల చెత్త ఉత్పత్తి అవుతోంది. మున్సిపాలిటీలో సిబ్బంది కొరత వల్ల పారిశుద్ధ్య పనులు సక్రమంగా జరగడం లేదన్న విమర్శలున్నాయి. 119 మంది పర్మినెంట్ కార్మికులుండగా..వారినే సూపర్‌వైజర్లుగా, డ్రైవర్లుగా, స్వీపర్లుగా వినియోగిస్తున్నారు. 43 పుష్‌కాట్ వాహనాలు అవసరంగా ఉండగా.. ప్రస్తుతం 16 మాత్రమే ఉన్నాయి. అవి కూడా చాలావరకు మూలకు చేరి నిరుపయోగంగా పడి ఉన్నాయి. పారిశుద్ధ్య పరిస్థితి నానాటికీ దిగజారడం వల్ల దోమల బెడద ఎక్కువైంది. ఫలితంగా ప్రజలు తరచూ రోగాల బారిన పడుతున్నారు.

పనిచేసినా పస్తులే..!



కొమరాడలో ఉపాధి హామీ పనుల్లో పాల్గొన్న వేతనదారులు

- రెండున్నర నెలలుగా అందని ఉపాధి హామీ వేతనాలు
- వెంటాడుతున్న ఆర్థిక కష్టాలు
- బతుకుబండి నడిపేందుకు అవస్థలు
- జిల్లాలో రూ.38.42 కోట్ల వేతన బకాయిలు

పార్వతీపురం:

కూటమి ప్రభుత్వం వచ్చాక అన్నివర్గాల ప్రజలతో పాటు ఉపాధిహామీ వేతనదారులకూ కష్టాలు తప్పడం లేదు. ప్రతిరోజు పనిచేస్తున్నా రెండు నెలలుగా వేతనాలు అందడం లేదు. కుటుంబాలను నెట్టుకొచ్చేందుకు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం కనీసం స్పందించడం లేదు. పనిచేసినా పస్తులుతప్పడం లేదంటూ వేతనదారులు గగ్గోలు పెడతున్నారు. ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. వేతనాలు అందజేయకుంటే బతికేది ఎలా అంటూ ప్రశ్నిస్తున్నా సమాధానం కరువవుతోంది. వేతనదారుల సమస్యపై పాలకులు కినుక వహించడంపై దుమ్మెత్తిపోస్తున్నారు.

నీరుగారుతున్న పథక లక్ష్యం

సన్నచిన్నకారు రైతు కుటుంబాలు, కూలీలకు స్థానికంగా ఉపాధి కల్పించి వలసలు నివారించేందుకు అమలుచేస్తున్న ఉపాధి హామీ పథకం లక్ష్యాన్ని కూటమి ప్రభుత్వం నీరుగార్చుతోంది. గతంలో ఉపాధిహామీ పనుల్లో పాల్గొనే వేతనదారులకు తాగేందుకు మజ్జిగ, ఎండనుంచి ఉపశమనం పొందేందుకు పని ప్రదేశంలో టెంట్లు వేసేవారు. ఇప్పుడు ఆ సదుపాయాలు కనిపించడం లేదు. ఎండలో మండిపోతూ పనిచేస్తున్నా సకాలంలో వేతనాలు అందజేయకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పనికి వెళ్లేవారందరికీ వంద రోజుల పనికల్పనతోపాటు ప్రతివారం ఠంచన్‌గా వేతనాలు చెల్లించేదని గుర్తుచేసుకుంటున్నారు.

జిల్లాలో రూ.38.42 కోట్లు బకాయిలు

జిల్లాలోని 15 మండలాల్లో ఉన్న 910 గ్రామాలలో 1.79 లక్షల జాబ్ కార్డులున్నాయి. ఇందులో ప్రస్తుతం 1.68 లక్షల మంది వేతనదారులు ఉపాధి హామీ పనుల్లో పాల్గొంటున్నారు. వీరికి 2025 జనవరి 14 నుంచి వేతనాలు అందలేదు. సుమారు రూ. 38.42 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉంది.



గతంలో వారం, పది రోజులకోసారి వేతనాలు బ్యాంకు ఖాతాల్లో జమయ్యేవని, ఇప్పుడు నెలలు తరబడుతున్నా వేతనాలు అందడంలేదని వేతన దారులు వాపోతున్నారు.

వేతనాలు జమ కావడంలేదు



ఉపాధిహామీ పథకంలో చేసిన పనులకు వేతనాలు బ్యాంకు ఖాతాల్లో జమ కావడం లేదు. దాదాపు మూడు నెలల నుంచి వేతనం ఇవ్వడం లేదు. పనుల్లో పాల్గొంటున్నా పస్తులతో గడపాల్సి వస్తోంది. గతంలో వారానికి ఒకసారి పే స్లిప్‌లు ఇచ్చి వేతనం డబ్బులను బ్యాంకు ఖాతాల్లో జమచేసేవారు.

– పైల వెంకటరమణ, గుణానపురం, కొమరాడ మండలం

ఇబ్బందులు పడుతున్నాం



ఉపాధి హామీ పనులకు డబ్బులు అందజేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. రోజువారీ ఖర్చులకు కూడా ఇబ్బందులు పడుతున్నాం.

– భూతాల వెంకటరమణ, వేతనదారు, జియ్యమ్మవలస

బతికేది ఎలా?



ఎండలో పనిచేస్తున్నాం. కూలి డబ్బులు వస్తే కుటుంబంతో కలిసి కాసిన్ని గెంజి నీళ్లు తాగేందుకు ఇబ్బంది ఉండదు. నెలలు తరబడి వేతనాలు అందజేయకపోతే బతికేది ఎలా?. పాలకులే సమాధానం చెప్పాలి.

– ఎస్.పద్మ, వేతనదారు, జియ్యమ్మవలస

ఉన్నతాధికారులకు విన్నవించాం



ఉపాధిహామీ పథకంలో పనికి వచ్చే ప్రతివేతనదారుకు చెల్లింపులు జరిపేలా ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. మరికొద్ది రోజుల్లో నిధులు విడుదలయ్యే అవకాశం ఉంది. నిధులు విడుదలైన వెంటనే వేతనదారుల ఖాతాల్లో వేతనం జమ చేస్తాం.

– కె.రామచంద్రరావు, డ్వామా పీడీ, పార్వతీపురం మన్యం జిల్లా

జిల్లాకు 12 జాతీయ నాణ్యత హామీ ప్రమాణ సర్టిఫికెట్లు

పార్వతీపురంటౌన్: జిల్లాలోని ఆయుష్మాన్ మందిరాలకు 12 జాతీయ నాణ్యతా హామీ ప్రమాణ సర్టిఫికెట్లు వచ్చేలా కృషిచేసిన వైద్యారోగ్యశాఖ అధికారులు, సిబ్బందిని కలెక్టర్ ఎ. శ్యామ్‌ప్రసాద్ గురువారం అభినందించారు. మార్చినెలలో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని నేషనల్ హెల్త్ సిస్టం రీసోర్సు సెంటర్‌కు చెందిన కేంద్ర ప్రభుత్వ వైద్య ఉన్నతాధికారులు జిల్లాలోని 15 ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల్లో ఉన్న మౌలిక వసతులు, రోగులకు సిబ్బంది అందించే వైద్యసేవల్లో నాణ్యతతో పాటు మందుల పంపిణీ, టీకాలు వేయడం, గర్భిణుల ఆరోగ్య పరిరక్షణ తదితర విభాగాల ద్వారా అందిస్తున్న సేవలను పరిశీలించారు. నేషనల్ హెల్త్ సిస్టం రీసోర్ సెంటర్ సభ్యుల పరిశీలనలో జిల్లాలోని 12 సబ్ సెంటర్ల ద్వారా సంతృప్తికరమైన సేవలు అందుతున్నట్లు గుర్తించి ఆయా సబ్ సెంటర్‌లకు నేషనల్ క్వాలిటీ ఎస్యూరెన్స్ స్టాండర్డ్ సర్టిఫికెట్లు మంజూరు చేశారు. ఒకేసారి జిల్లాలో 12 సబ్ సెంటర్‌లకు ఎన్కాస్ సర్టిఫికెట్లు మంజూరు కావడం, ఇందులో గిరిజన ప్రాంతాల్లో గల సబ్ సెంటర్లు ఎక్కువవగా ఉండడం పట్ల కృషి చేసిన అందరినీ కలెక్టర్ అభినందించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ భాస్కరరావు, ప్రోగ్రాం అధికారులు డా.రఘు, డా.వినోద్, జిల్లా క్వాలిటీ ఎసూరెన్స్ అధికారి కె.శ్రీనివాసరావు, జిల్లా పబ్లిక్ హెల్త్ కన్సల్టెంట్ డా.డి రమణకుమార్ తదితరులు పాల్గొన్నారు.



వైద్యసిబ్బందిని అభినందిస్తున్న కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

పూలే, అంబేడ్కర్ జయంతి ఘనంగా నిర్వహిద్దాం

మహాత్మా జ్యోతిరావు పూలే, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతులను జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ సంబంధింత అధికారులను ఆదేశించారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 11వ తేదీన జ్యోతిరావు పూలే, 14న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో ఆయా తేదీల్లో ఉదయం 9 గంటలకు కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించి కార్యక్రమం నిర్వహిద్దామని స్పష్టం చేశారు. ఈ మేరకు బీసీ, ఎస్సీ వర్గాలకు చెందిన స్త్రీనిధి, ఉన్నతి, బ్యాంకు లింకేజీలు వంటి మెగా చెక్కుల పంపిణీ ఉండాలని, వాటికి సంబంధించిన పనులు డీఆర్‌డీఏ, మెప్మా అధికారులు చేపట్టాలని కోరారు. బీసీ కార్పొరేషన్ ద్వారా ఆదరణ యూనిట్ల పంపిణీ, బీసీ, ఎస్సీ, కార్పొరేషన్ల ద్వారా రుణాలు, యూనిట్ల పంపిణీ ఆయా అధికారులు చేపట్టాలని సూచించారు. అలాగే గృహనిర్మాణ సంస్థ, వ్యవసాయ, పశుసంవర్ధక, విభిన్న ప్రతిభావంతుల శాఖల ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేసి యూనిట్ల పంపిణీకి చర్యలు తీసుకోవాలని చెప్పారు. అంబేడ్కర్ జయంతి రోజున ఆయన చరిత్రను తెలియజేసేలా ఛాయాచిత్ర ప్రదర్శనను ఎస్సీ కార్పొరేషన్ సహకారంతో ఏర్పాటు చేయాలని చెప్పారు. సమావేశంలో డీఆర్‌ఓ హేమలత, ఎస్‌డీసీ పి.ధర్మచంద్రారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ సుధారాణి, డ్వామా పీడీ రామచంద్రరావు, డీఎంహెచ్‌ఓ భాస్కరరావు, డీపీఆర్‌ఓ ఎల్.రమేష్, ఎల్‌డీఓ రమేష్ రామన్ తదితరులు పాల్గొన్నారు.

వండవ–తూడికొండల్లో పేలుతున్న తూటాలు

- గత కొన్ని రోజులుగా గుట్టుగా సాగుతున్న వన్యప్రాణుల వేట
- బుధవారం రాత్రి వేటగాళ్ల తూటాకు బలైన చుక్కల దుప్పి!



బుల్లెట్ గాయంతో మృతి చెందిన దుప్పి

వీరఘట్టం:

పార్వతీపురం మన్యం జిల్లా వీరఘట్టం మండలంలోని వండవ-తూడి కొండల్లో తూటాలు పేలుతున్నాయి. వన్యప్రాణుల వేట జోరుగా సాగుతోంది. బుధవారం అర్ధరాత్రి జరిగిన వేటలో ఓ చుక్కల దుప్పి వేటగాళ్ల తూటాకు బలైపోయింది. కొండ ప్రాంతం నుంచి వండవ గ్రామంలోకి వచ్చి రోడ్డుపై మృతి చెందింది. గురువారం ఉదయం మృతి చెందిన దుప్పిని చూసిన వండువ గ్రామస్తులు అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. దాహార్తిని తీర్చుకోవడానికి మైదానం ప్రాంతానికి వచ్చి కుక్కల దాడిలో మృతి చెందినట్లు తొలుత అనుమానించారు. తర్వాత పశువైద్యాధికారి డాక్టర్ చైతన్య శంకర్ వచ్చి దుప్పికి పోస్టుమార్టం నిర్వహించి బుల్లెట్ గాయంతో మృతి చెందినట్లు నిర్ధారించారు. అటవీశాఖ వీరఘట్టం సెక్షన్ ఆఫీసర్ రవిబాబు ఆధ్వర్యంలో దుప్పికి అటవీశాఖ సిబ్బంది దహన సంస్కారాలు నిర్వహించారు. వన్యప్రాణుల జీవనానికి ఆలవాలంగా ఉండే తూడికొండల్లో వేటగాళ్లు నాటు తుపాకీలతో వేట సాగిస్తుండడంపై స్థానికులు భగ్గుమంటున్నారు.



దుప్పి మెడపై తగిలిన బుల్లెట్ గాయం

132 ఎకరాల్లో విస్తరించిన ఉన్న కొండలు...

అటవీశాఖ పరిధిలో 132 ఎకరాల్లో తూడి-వండవ కొండలు విస్తరించి ఉన్నాయి. ఈ కొండల్లో ఉన్న జీడితోటల నుంచి వచ్చే ఫలసాయంపై అటవీశాఖ అధికారులు దృష్టి సారిస్తున్నారే తప్ప... కొండల్లో ఉన్న వన్యప్రాణుల సంరక్షణను విస్మరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. జింకలు, దుప్పిలు, కొండ మేకలు, అడవి పందులు, కుందేళ్లు సంచరించే కొండలను వన్యప్రాణి జోన్‌గా గుర్తించి సంరక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

కేసు నమోదు...

వండవ గ్రామ సమీపంలో అనుమానస్పదంగా దుప్పి మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు వీరఘట్టం అటవీశాఖ సెక్షన్ ఆఫీసర్ రవిబాబు తెలిపారు. వన్యప్రాణులను వేటాడితే 1972 వన్యప్రాణుల సంరక్షణ చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా దర్యాప్తు చేస్తామని చెప్పారు. వన్యప్రాణుల జోన్‌గా గుర్తించాలని ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు.



వన్యప్రాణులకు నిలయమైన వండవ కొండ ఇదే..

వన్యప్రాణుల సంరక్షణకు చర్యలు చేపట్టాలి

- మాజీ ఎమ్మెల్యే కళావతి

వండువ-తూడి కొండల్లో అరుదైన వన్యప్రాణులు ఉన్నాయని, వీటి సంరక్షణకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి కోరారు. బుల్లెట్ గాయంతో వండవ గ్రామ సమీపంలో మృతి చెందిన దుపిపని గురువారం ఆమె పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. 132 ఎకరాల్లో విస్తరించి ఉన్న వండువ-తూడి కొండల్లో దుప్పిలు, జింకలు, అడవి పందులు, కుందేళ్లు వంటి వన్యప్రాణులు వేల సంఖ్యలో ఉన్నాయన్నారు. వాటిని సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. అటవీ ఫలసాయం అటవీశాఖది, భూమి రెవెన్యూశాఖదిగా భావించి వన్యప్రాణుల సంరక్షణను విస్మరిస్తున్నారన్నారు.



మృతి చెందిన దుప్పిని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే కళావతి

క్లుప్తంగా

క్షయ రోగుల కుటుంబ సభ్యులకు పరీక్షలు

- జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ కె.రాణి



స్కిన్‌టెస్టును పరిశీలిస్తున్న డాక్టర్ రాణి

విజయనగరం ఫోర్ట్: క్షయ రోగుల కుటుంబసభ్యులకు క్షయ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్టు జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ కె.రాణి తెలిపారు. ఈ మేరకు స్థానిక అరుంధతి నగర్‌లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో క్షయ రోగుల కుటుంబసభ్యులకు చేస్తున్న స్కిన్ (సీవై-టీబీ) టెస్టును గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్షయ రోగుల కుటుంబసభ్యులకు స్కిన్ టెస్టు చేయనున్నామని చెప్పారు. 48 నుంచి 72 గంటల్లో ఈ పరీక్ష రిజల్ట్ వస్తుందన్నారు. ఈ పరీక్షలో 5ఎంఎంగా నిర్ధారించిన ఎడల టీబీ ప్రివెంటివ్ థెరపీ ఇవ్వనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వైద్యులు అర్చన దేవి, అశోక్ పాల్గొన్నారు.

ఒకే ఈతలో రెండు ఆవుదూడలు



ఆవు, దూడలను పరిశీలిస్తున్న పశువైద్యశాఖ ఎ.డి చంద్రశేఖర్ తదితరులు

గజపతినగరం: మండల కేంద్రంలోని ఎం.వెంకటాపురం గ్రామానికి చెందిన మార్కెట్ యార్డు చైర్మన్ పీవీవీ గోపాల రాజు జెర్సీ ఆవు ఒకే ఈతలో రెండు జెర్సీ ఆడపెయ్యలకు జన్మనిచ్చింది. ఈ విధంగా కవలలు పుట్టడం చాలా అరుదని స్థానిక పశువైద్య శాఖ ఎ.డి చంద్రశేఖర్ అన్నారు. గురువారం పీవీవీ గోపాల రాజుకు చెందిన ఆవు, దానికి పుట్టిన రెండు ఆడపెయ్యలు ఆరోగ్యంగా ఉన్నదీ లేనిదీ పరిశీలించానని ఎ.డి చంద్రశేఖర్ తెలిపారు. ఒకే ఈతలో జన్మించిన ఆవుపెయ్యిలను పలువురు ఆసక్తిగా తిలకించారు.

రూ.కోటి 72 లక్షల విలువైన సిగరెట్లు సీజ్

- శ్రీకాకుళం, విజయనగరం, జిల్లాల విజిలెన్స్ ఎస్పీ



సిగరెట్లు స్వాధీనం చేసుకున్న విజిలెన్స్ అధికారులు

విజయనగరం క్రైమ్: ఎలాంటి ట్యాక్స్‌లు చెల్లించకుండా ఒడిశా నుంచి ఏపీలోకి వచ్చిన రూ.కోటి 72 లక్షల విలువ గల సిగరెట్లను విజిలెన్స్ అధికారులు సీజ్ చేశారు. విజయనగరంలోని ఎంవీఆర్‌జీఆర్ కాలేజ్ సమీపంలో గల సూర్య లేఅవుట్‌లో సుంకర పేట వద్ద ఓ గోడౌన్‌లో సిగరెట్లు డంప్ చేస్తుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ సందర్భంగా విజిలెన్స్ ఎస్పీ బర్ల ప్రసాద్ విలేకరులతో మాట్లాడుతూ ఒడిశా రాష్ట్రానికి చెందిన ఓ వ్యాన్‌లో అగ్గిపెట్టెలు బిల్లులతో రవాణా చేస్తున్నట్లు తొలుత తమకు సమాచారం అందిందన్నారు. అయితే మ్యాచ్‌బాక్స్ బిల్లు పేరుతో 3 లక్షల 16 వేల సిగరెట్ బాక్స్‌లు సరఫరా చేస్తున్నారని, తర్వాత అందిన సమాచారంతో సూర్య లే అవుట్ వద్ద ఉన్న ఓ గొడౌన్‌లో దాడి చేసి వ్యాన్‌లో ఉన్న సిగరెట్ల లోడును స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ తెలిపారు.

నిరాదరణకు గురైన బాలికకు సంరక్షణ



బాలికను వసతి గృహంలో చేర్చుతున్నట్లు మాజీ ఎంపీ ప్రదీప్ కుమార్ దేవ్‌కు లేఖను అందజేస్తున్న ఐసీడీఎస్ అధికారులు

గుమ్మలక్ష్మీపురం: కురుపాం మండల కేంద్రంలోని శివన్నపేట గ్రామంలో నిరాదరణకు గురైన 11 ఏళ్ల బాలికను మాజీ ఎంపీ వైరిచర్ల ప్రదీప్ కుమార్ దేవ్ చొరవతో..మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ టి.కనకదుర్గ ఆదేశాల మేరకు జిల్లా బాలల సంరక్షణ అధికారులు బాలబాలికల వసతి గృహానికి గురువారం తరలించారు. తల్లిదండ్రులు వదిలేసిన ఓ బాలిక శివన్నపేటలో తిరుగుతూ ఎవరైనా తిన డానికి ఇస్తే తింటూ..రోజుకో ఇంటి గడపలో తలదాచుకుంటోందన్న సమాచారాన్ని స్థానికుల ద్వారా తెలుసుకున్న మాజీ ఎంపీ ప్రదీప్ కుమార్ దేవ్ బాలిక సంరక్షణ నిమిత్తం ఐసీడీఎస్ పీడీ కనకదుర్గకు తెలియజేశారు. దీనిపై స్పందించిన పీడీ ఆ బాలికను బాలబాలికల వసతి గృహంలో చేర్పించాలని జిల్లా బాలల సంరక్షణ అధికారి అల్లు సత్యనారాయణకు ఆదేశించగా..ఆయనతో పాటు జిల్లా లీగల్ ఆఫీసర్ పి.శ్రీధర్ బాలికతో మాట్లాడి చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ముందు హాజరుపరిచి, వారి సూచనల మేరకు వసతి గృహంలో చేర్పించారు. కార్యక్రమంలో కురుపాం మహిళా సంరక్షణ అధికారి రోజారాణి, ఐసీడీఎస్ సిబ్బంది ఉన్నారు.

విలక్షణం.. అడవి బిడ్డల జీవనం

చుట్టూ కొండలు..జలపాతాలు..రాళ్లూరప్పలు..పచ్చని ప్రకృతి..శబ్ద, వాయు కాలుష్యం కానరాని ప్రాంతం..ఆరోగ్యంగా జీవనం సాగించే గిరిజనం..ఎక్కడో దూరాన విసిరేసేలా ఉండే ఊళ్లు..ఇంకా అమాయకత్వాన్ని వీడని మోములు..రాయనక..రప్పనక..ఎండనక..వాననక..అడవి తల్లినే నమ్ముకున్న జీవితాలు..తరాలు గడిచినా..వారి జీవితం విలక్షణమే..పేరుకు జిల్లా కేంద్రంలో ఉన్నా సరే..వారింకా అడవిబిడ్డలే. పార్వతీపురం మండలంలోని తొక్కుడువలస, సీతంపేట, తాన్నవలస తదితర గిరిజన గ్రామాల్లోని ప్రజల జీవన చిత్రాలివి.

–పార్వతీపురం రూరల్



అడవి నుంచి కట్టెలు మోసుకొస్తున్న యువతి



సీతంపేటలో చంకలో చంటిబిడ్డలతో గిరిజన మహిళలు



ఇదే మీటింగ్ హాల్: ఓ చోట కూర్చుని నలుగురూ కలిసి బాతాఖానీ



ఈ తెలివి మాకే సొంతం: ఓవైపు పశువులకు నీడలా.. మరోవైపు కావాల్సిన గడ్డిని అవే తీసుకునేలా సీతంపేటలో గిరిజనులు చేసిన ఏర్పాటు



కొండల మధ్యన విసిరేసినట్టు ఉన్న తాన్నవలస గ్రామం



అమ్మానాన్న అడవికి: నేనేమో ఆటకు..



తగ్గేదేలే: మోడల్ ద్విచక్ర వాహనంతో రయ్‌మని దూసుకుపోతున్న గిరిజనుడు



ఎవరో వచ్చారే: ఇంటి వసారాలో నుంచి భయంగా చూస్తున్న గిరిబాలలు




గిరిజన మహిళ



అడవినుంచి జీడిపళ్లు ఏరుకుని వస్తున్న గిరిజన మహిళ

ప్రతి కుటుంబం లక్ష ఆదాయం పొందాలి

- కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురంటౌన్: జిల్లాలోని ప్రతికుటుంబం కనీసం రూ.లక్ష ఆదాయం పొందాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అన్నారు. వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ రంగాల నుంచి జీవనోపాధి కల్పనలో భాగంగా కలెక్టర్ కార్యాలయంలో గురువారం సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి కుటుంబం కనీసం రూ.లక్ష ఆదాయం సంపాదించాలని ఇందుకు వ్యవసాయ, ఉద్యాన పంటలు, పశుసంవర్ధక సంబంధిత ఆవులు, మేకలు, గొర్రెలు, కోళ్ల పెంపకాల యూనిట్ల ఏర్పాటు వల్ల పొందే ఆదాయ మార్గాలపై కార్యాచరణ ప్రణాళిక తయారు చేయాలని సూచించారు. జిల్లాలో 110 ఎకరాల్లో పనస పంట వేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. ఒక కుటుంబం రూ.లక్ష ఆదాయం పొందేందుకు అవసరమైన పెట్టుబడి, వేతనాలు, చెల్లింపు, ఖర్చులు తదితర అంశాలతో స్పష్టమైన కార్యాచరణ రూపొందించి ప్రణాళికాబద్ధంగా అమలు చేయడం వల్ల వారి జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని అభిప్రాయ పడ్డారు. కార్యక్రమంలో నాబార్డ్ జిల్లా అభివృద్ధి అధికారి డీఎస్ దినేష్ కుమార్ రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ ఎం.సుధారాణి, జిల్లా ఉద్యానశాఖాధికారి బి. శ్యామల, జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారి వి.రాధాకృష్ణ, జిల్లా అగ్రిట్రేడ్ మార్కెటింగ్ అధికారి అశోక్ కుమార్, వివిధ శాఖల జిల్లా అధికారులు, కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

మృతిచెందిన పోలీసు కుటుంబానికి 'చేయూత'



మృతుడి భార్య శారదకు చెక్కు అందజేస్తున్న ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్: పోలీస్‌శాఖలో ఇటీవల అకాల మరణం చెందిన కానిస్టేబుల్ కుటుంబానికి ఎస్పీ వకుల్ జిందల్ 'చేయూత' కింద ఆర్థిక సహాయం చేశారు. ఈ మేరకు శాఖలో పనిచేస్తున్న సిబ్బంది పోగు చేసిన రూ.లక్షా, 48 వేల మొత్తాన్ని గురువారం మృతుడి కుటుంబానికి అందజేశారు. శాఖలో ఏ ఒక్కరైనా అనారోగ్యంతో మృతి చెందితే పోలీస్‌శాఖ చేయూత ద్వారా ఆదుకుంటుందని ఎస్పీ ఈ సందర్భంగా అన్నారు. ఇందుకోసం శాఖలో సిబ్బంది అంతా ప్రతినెలా కొంత సొమ్ము పోగు చేస్తున్నారని చెప్పారు. మార్చి 8న ఏఆర్ విభాగానికి చెందిన కానిస్టేబుల్ సీహెచ్.గోపాలరావు అనారోగ్యంతో మృతి చెందారని, ఆయన కుటుంబాన్ని ఆదుకునేందుకు 'చేయూత' ద్వారా చెక్కును మృతుడి భార్య సీహెచ్ శారదకు అందజేసినట్లు తెలిపారు. ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం, కుటుంబంలో ఒక్కరు ఉద్యోగం పొందేందుకు అవసరమైన సర్టిఫికెట్లు డీపీఓలో అందజేయాలని ఎస్పీ ఈ సందర్భంగా మృతుడి కుటుంబసభ్యులకు చెప్పారు. కార్యక్రమంలో ఏఎస్పీ సౌమ్యలత, డీపీఓ ఏఓ శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ రామకృష్ణ, ఆర్‌ఐ గోపాలనాయుడు, పోలీస్ అసోసియేషన్ అడ్‌హాక్ కమిటీ అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన బాలింత మృతి

- పసర వైద్యమే కారణమా?



మరణించిన సేవి లక్ష్మి

సాలూరు: పాచిపెంట మండలంలోని గిరిశిఖర మోదుగ పంచాయతీ గ్రామానికి చెందిన గిరిజన బాలింత సేవి లక్ష్మి(30) మరణించింది. గురువారం ఉదయం పట్టణంలోని ప్రభుత్వాస్పత్రికి అంబులెన్స్‌లో ఆమెను తీసుకురాగా ఆస్పత్రిలో బెడ్ మీద వేయగానే మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన లక్ష్మి సుమారు రెండు నెలల క్రితం మూడవ బిడ్డకు జన్మనిచ్చింది. ఇటీవల ఆమె అనారోగ్యానికి గురికాగా పాచిపెంట సీహెచ్‌సీకి తీసుకువెళ్లి చికిత్స చేయించారు. ఒకరోజు వైద్యం తరువాత ఆమెను మళ్లీ గ్రామానికి తీసుకువెళ్లారు. అయితే ఆమెకు పచ్చకామెర్లు వచ్చాయని పసర వైద్యం చేయించినట్లు తెలియవస్తోంది. దీంతో ఒళ్లంతా వాపులు రావడంతో సాలూరు ఏరియా ఆస్పత్రికి గురువారం ఉదయం తీసుకువచ్చారు. దీనిపై ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మీనాక్షిని వివరణ కోరగా, గురువారం ఉదయం ఆస్పత్రికి ఆమెను తీసుకువచ్చారని, బెడ్ మీద వేసిన కొన్ని నిమిషాల్లోనే మరణించిందన్నారు. సెప్టిక్‌షాక్ విత్‌మల్టీ ఆర్గాన్ ఫెయిల్యూర్ కారణంగా మృతిచెందినట్లు చెప్పారు. ఆమెకు పచ్చకామెర్లు రావడంతో ఇంటివద్ద పసర వైద్యం చేయించామని బంధువులు చెప్పారన్నారు.

బాత్‌రూమ్‌లో పడి వ్యక్తి మృతి

- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన



కోరాడ సూర్యనారాయణ అలియాస్ సురేష్ (ఫైల్)

పార్వతీపురం రూరల్: పట్టణంలోని వివేకానంద కాలనీలో బాత్‌రూమ్‌లో పడి ఒక వ్యక్తి మృతిచెందిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ మేరకు పట్టణ పోలీసులు గురువారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కాలనీకి చెందిన కోరాడ సూర్యనారా యణ (46)అలియాస్ సురేష్ అనే వ్యక్తి ఈనెల 8న తన స్వగృహంలో ఉన్న బాత్‌రూమ్‌లో పడి మృతిచెందాడు. గురువారం దుర్వాసన రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా పోలీస్ సిబ్బంది వచ్చి పరిశీలించి సూర్యనారాయణ మృతిచెందినట్లు నిర్ధారించి కుటుంబసభ్యులకు సమాచామందించగా ఉగాది రోజున కన్నవారి ఇంటికి వెళ్లిన భార్య హుటాహుటిన వచ్చింది. ఉగాది రోజున భార్య ఊరికి వెళ్లగా సూర్యనారాయణ ఒక్కడే ఇంటిలో ఉంటూ మద్యం తాగిన మత్తులో బాత్‌రూమ్‌లో పడిపోయి ఉంటాడని స్థానికులు సందేహం వ్యక్తం చేస్తున్నారు. మృతుడి భార్య శ్రీలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కె.మురళీధర్ తెలిపారు. మృతునికి ఒక కుమార్తె ఉంది.

పింఛన్ కోసం ఎదురుచూస్తూ..

- ఆకలితో అలమటించి..
- మరణించిన గిరిజన వితంతువు
- కూటమి ప్రభుత్వంపై స్థానికుల మండిపాటు



మరణించిన గిరిజన వృద్ధురాలు వంజరపు అన్నపూర్ణ

సాలూరు/సాలూరు రూరల్ : ఏ ఆధారం లేని తనకు పింఛన్ సొమ్ము వస్తే జీవనం సాఫీగా సాగించవచ్చని భావించింది. తొమ్మిదినెలలు దాటినా ఆ ఎదురుచూపులు అలాగే మిగిలిపోయాయి. చివరకు పింఛన్ మంజూరు కోసం ఎదురుచూస్తూ.. ఆకలితో అలమటించి ఓ గిరిజన వితంతువు తనువుచాలించిన హృదయ విదారక సంఘటన గిరిజన సంక్షేమ శాఖామంత్రి, స్త్రీశిశుసంక్షేమశాఖమంత్రి గుమ్మడి సంధ్యారాణి ప్రాతినిధ్యం వహిస్తున్న సాలూరు నియోజకవర్గంలో బుధవారం జరిగింది. ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. సాలూరు మండలంలోని కూర్మరాజుపేట పంచాయతీ గ్రామానికి చెందిన గిరిజన వృద్ధురాలు వంజరపు అన్నపూర్ణ (62) పింఛన్ కోసం తిరుగుతూ, ఆకలితో అలమటిస్తూ బుధవారం రాత్రి తనువు చాలించింది. ఆమె భర్త కన్నయ్యకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో పింఛన్ వచ్చేది. అయితే 2023 డిసెంబరు 6న కన్నయ్య మరణించాడు. భర్త మరణించిన కారణంగా తనకు పింఛన్ మంజూరుచేయాలని ఆమె స్థానిక సచివాలయానికి వెళ్లింది. అయితే ఆమెకు ఫింఛన్ మంజూరయ్యేలోపు ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో మంజూరు కాలేదు. తరువాత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు సుమారు 9నెలలు కావస్తున్నా నేటికీ ఆమెకు పింఛన్ మంజూరు చేయలేదు. దీంతో ఆ ఒంటరి వృద్ధురాలికి స్థానికులు సాయం చేయగా పొట్ట పోషణ చేసుకునేది. ఈ క్రమంలో పింఛన్ సొమ్ము రాక, ఆకలితో అలమటిస్తూ బుధవారం తనువుచాలించింది. ఈ హృదయ విదారక సంఘటనతో స్థానికులు భావోద్వేగానికి లోనయ్యారు.

వితంతువులతో రాజకీయమా..?

ఇటువంటి సంఘటనల నేపథ్యంలో కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గత ఏడాది నవంబర్ నుంచి పింఛన్ తీసుకుంటున్న భర్త మరణిస్తే భార్యకు వెంటనే పింఛన్ మంజూరుచేయాల్సి ఉంది. కూటమి పాలనలో భర్త మరణించినా భార్యకు వితంతు పింఛన్ మంజూరు కాకపోవడంతో సర్వత్రా వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఎన్నికల్లో ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలు గాలికొదిలేసిన పాలకులు వితంతువుల పట్ల కూడా ఇంత స్వార్థపూరిత రాజకీయాలు చేస్తారా? అంటూ కూటమి ప్రభుత్వ వికృత చర్యలపై మండిపడుతున్నారు.

ఇది దారుణం



కూర్మరాజుపేటలో గిరిజన వృద్ధురాలు వంజరపు అన్నపూర్ణమ్మ పింఛన్ మంజూరుకాక కుటుంబపోషణకు ఆధారం లేక ఆకలితో మరణించడం చాలా బాధాకరం. ఇది నన్ను బాగా కలిచివేసింది. కూటమి ప్రభుత్వంలో రాష్ట్రంలో ఇటువంటి వారు లక్షల్లో ఉండొచ్చు. వారు మనుషులు కాదా? వారి కష్టాలు నేటి పాలకులకు పట్టకపోవడం అత్యంత శోచనీయం. ఇకనైనా ప్రభుత్వం ఈ విషయంపై వెంటనే ఆలోచించి, అర్హులందరికీ పింఛన్లు అందించాలి.

–పీడిక రాజన్నదొర, మాజీ డిప్యూటీ సీఎం

లైంగిక దాడి కేసులో ముద్దాయికి జైలుశిక్ష

విజయనగరం క్రైమ్: 2021లో విజయనగరంలో మహిళను మోసగించి, లైంగికదాడికి పాల్పడిన ముద్దాయికి ఏడాది జైలు శిక్ష, రూ.పదివేలు జరిమానా విధిస్తూ విజయనగరం మహిళా కోర్టు 5వ ఏడీజే, తీర్పు ఇచ్చినట్లు మహిళా పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ నరసింహమూర్తి తెలిపారు. ఈ కేసుకు సంబంధించి ఆయన తెలియజేసిన వివరాలిలా ఉన్నాయి. నగరంలోని దాసన్నపేటకు చెందిన మొయిద పైడిరాజు ఓ మహిళను నమ్మించి, మోసగించి లైంగిక దాడికి పాల్పడ్డాడు. దీంతో బాధిత మహిళ 2021లో అప్పటి దిశ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్సై శ్యామల దేవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అప్పటి దిశ డీఎస్పీ త్రినాథ్ నిందితుడ్ని అరెస్ట్ చేసి అభియోగపత్రాలు కోర్టులో దాఖలు చేశారు. నాలుగేళ్ల విచారణ అనంతరం నేరారోపణ రుజువు కావడంతో మహిళా న్యాయమూర్తి పద్మావతి ముద్దాయి నాగరాజుకు పైవిధంగా శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

డీఎస్సీ నోటిఫికేషన్ తక్షణమే విడుదల చేయాలి



మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ సీహెచ్ హరీష్

విజయనగరం గంటస్తంభం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వివిధ రకాల కారణాల చెబుతూ డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలలో జాప్యం చేయడం తగదని డీవైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ సీహెచ్.హరీష్ అన్నారు. ఈ సందర్భంగా హరీష్ మాట్లాడుతూ..రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేస్తామని, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం సందర్భంగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలపై తొలిసంతకం చేశారన్నారు. కానీ నేటికీ నోటిఫికేషన్ వెలువడలేదని, నోటిఫికేషన్ రాక లక్షలాది మంది నిరుద్యోగులు కోచింగ్ సెంటర్లలో లక్షలాది రూపాయలు వెచ్చించి కోచింగ్ తీసుకుంటూ తీవ్ర నిరాశకు గురవుతున్నారన్నారు. నోటిఫికేషన్ ఎప్పుడు వస్తుందో తెలియక, అసలు వస్తుందో రాదో అన్న అయోమయ పరిస్థితిలో పలువురు అభ్యర్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్న సందర్భాలు ఉన్నాయని గుర్తు చేశారు. విజయనగరం జిల్లాకు పోస్టుల ఎంపిక విషయంలో అన్యాయం జరిగిందని, తక్కువ పోస్టులు మంజూరు చేశారని అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారన్నారు. 16,347వేల పోస్టులు కాకుండా 25వేలతో మెగా డీఎస్సీ నిర్వహించేలా చూడాలని, నిరుద్యోగ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లామని చెప్పారు. త్వరితగతిన డీఎస్సీ నోటిఫికేషన్ అన్ని వివరాలతో వెలువడేలా చూడాలని, తక్షణమే మెగా డీఎస్సీ ద్వారా పోస్టులను భర్తీ చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళ్లి నిరుద్యోగులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹125	₹220	₹230

రెండు వారాల్లో సివిల్ వర్క్స్ పూర్తి చేయాలి



మాట్లాడుతున్న సమగ్ర శిక్షణ రాష్ట్ర బృందం అధికారి డాక్టర్ ప్రసాదరావు

- పీఎంశ్రీ స్కూల్స్ అభివృద్ధిపై రాష్ట్ర బృందం సమీక్ష

విజయనగరం అర్బన్: జిల్లాలోని పీఎంశ్రీ పాఠశాలల్లో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను రెండు వారాల్లో పూర్తి చేయాలని ఆయా స్కూల్స్ ప్రధానోపాధ్యాయులు, ఇంజినీర్‌లను పథకం రాష్ట్ర అధికారుల బృందం ఆదేశించింది. పీఎంశ్రీ స్కూల్స్ ప్రధానోపాధ్యాయులు, ఇంజినీరింగ్ విభాగ సిబ్బందితో స్థానిక యూత్ హాస్టల్‌లో గురువారం రాష్ట్రబృందం అధికారులు డాక్టర్ ఎం.ప్రసాదరావు, మహేశ్వరరెడ్డి, జయలక్ష్మి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో పీఎంశ్రీ పథకం మంజూరైన 34 పాఠశాలల అభివృద్ధికి సంబంధించిన సివిల్ వర్క్స్'లో భాగంగా కెమిస్ట్రీ ల్యాబ్స్, లైబ్రరీ రూమ్స్, ప్లే ఫీల్డ్స్, కిచెన్ గార్డెన్ రియిన్ వాటర్ హార్వెస్టింగ్ తదితర పనుల వివరాలను పాఠశాలల వారీగా తెలుసుకున్నారు. అదేవిధంగా అకడమిక్ పురోభివృద్ధిపై సమీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంబంధిత పనులకు నిధులు మంజూరయ్యాయని జాప్యం లేకుండా పనులు పూర్తి చేయాలని కోరారు. ఎస్ఎస్ఏ ఏపీసీ డాక్టర్ ఎ.రామారావు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో డీఈఓ యు.మాణిక్యంనాయుడు, ఏఎంఓ బి.ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం పట్టణం పరిధిలోని మలిచర్ల ఉన్నత పాఠశాలలో పీఎంశ్రీ పథకం పనులను రాష్ట్ర బృందం పరిశీలించింది.

విద్యార్థి మిత్ర స్టాక్ పాయింట్ పరిశీలన

పట్టణంలోని సెయింట్ ఆన్స్ పాఠశాలలో ఏర్పాటు చేసిన 'సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర' పథకానికి సంబంధించిన సామగ్రి స్టాక్ పాయింట్‌ను సమగ్ర శిక్ష రాష్ట్ర అధికార బృందం సందర్శించింది. త్వరలో జిల్లాలోని 1 నుంచి 10వ తరగతి విద్యార్థులకు అందజేసే స్టూడెంట్ కిట్స్‌ను భద్రపరిచే ప్రదేశాలను పరిశీలించారు. జిల్లాకు వచ్చిన కిట్స్ ప్రతి విద్యార్థికి అందేలా ఏర్పాట్లు చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారులకు సూచించారు.